క్లుప్తంగా

కూలీలను వెనక్కు పంపడంపై విచారణ



ఉపాధి కూలీలను విచారిస్తున్న ఏపీఓ, సిబ్బంది

హొళగుంద: గజ్జహళ్లి గ్రామంలో గురువారం దాదాపు 120 మంది ఉపాధి కూలీలకు పని కల్పించకుండా ఇంటికి పంపిన ఘటనపై శుక్రవారం ఏపీఓ భక్తవత్సలం, ఉపాధి పథకం ప్రత్యేకధికారి సురేశ్‌బాబు, టీఏలు హులిగప్ప, రామకృష్ణ తదితరులు విచారణ చేపట్టారు. పనులకు ఆలస్యంగా వచ్చారని గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ రంజాన్ కూలీలను గురువారం ఇంటికి పంపించిన విషయం తెలిసిందే. ఘటనపై ఫిర్యాదులు, పత్రికల్లో వార్తలు రావడంతో ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. ఈ మేరకు అధికారులు శుక్రవారం ఉపాధి కూలీలను, ఫీల్డ్ అసిస్టెంట్‌ను విచారించారు. ఏపీఓ భక్తవత్సలం మాట్లాడుతూ.. కూలీలు పనికి ఆలస్యంగా వచ్చారని, అప్పటికే ఎన్‌ఎంఎంఎస్ యాప్‌లో అటెండెన్స్ వేయడం వల్ల కూలీలు పని చేసినా ఫలితం ఉండదన్నారు. దీంతో మరుసటి రోజు నుంచి సమయానికి పనికి రావాలని సూచించి ఇంటికి పంపినట్లు వెల్లడించారు. విచారణ నివేదికను ఎంపీడీఓతో పాటు జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తామని ఆయన తెలిపారు.

పాఠశాలకు పుస్తకాల విరాళం



దాతలు ఇచ్చిన పుస్తకాలతో ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఆస్పరి: మండలంలోని చిన్నహోతూరు జెడ్పీ హైస్కూల్‌కు ఎన్‌ఆర్‌ఐల సహకారంతో ప్రకాశం జిల్లా జన విజ్ఞాన వేదిక సభ్యులు మాల్యాద్రి, సీపీ ప్రసాద్ రూ.30 వేలు విలువ చేసే పుస్తకాలను విరాళంగా అందించినట్లు హెచ్‌ఎం చిరంజీవి రెడ్డి తెలిపారు. శుక్రవారం పాఠశాలలో హెచ్‌ఎం మాట్లాడుతూ.. మహా నాయకులు రాసినవి, చరిత్రలకు సంబంధించిన పుస్తకాలు ఉన్నాయని, ఇవి విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

పైపులైన్ పనులు పూర్తి చేయండి



అధికారులకు సూచనలు చేస్తున్న చీఫ్ ఇంజినీర్ కబీర్‌బాషా

తుగ్గలి: హంద్రీనీవా కాలువ ద్వారా చెరువులకు నీటిని మళ్లించేందుకు చేపట్టిన పైపులైన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని నీటి పారుదల శాఖ చీఫ్ ఇంజినీర్ కబీర్‌బాషా ఆదేశించారు. శుక్రవారం మండలంలోని రాతన, తుగ్గలి, రాంపల్లి చెరువులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు. జిల్లాలో 68 చెరువులకు నీటిని మళ్లించే పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆ మేరకు పైపులైన్ పనులను వేగవంతం చేశామన్నారు. చెరువులను నీటితో నింపితే తాగునీటి సమస్యతో పాటు ఆయకట్టు సాగుకు ఇబ్బంది ఉండదన్నారు. ఎస్‌ఈ రెడ్డిశేఖర రెడ్డి, డీఈలు రామకృష్ణ, రవీంద్రనాథ రెడ్డి, జేఈలు వెంకటేష్ నాయక్, రియాజ్ వెంట ఉన్నారు.

బెంగళూరుకు వెళ్లి పింఛన్ పంపిణీ



తిక్కమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ శ్రావణ్ రాజు

ఆలూరు రూరల్: అనారోగ్యంతో బాధపడుతూ బెంగళూరులో చికిత్స పొందుతున్న వృద్ధురాలికి వలంటీర్ శ్రావణ్ రాజు పింఛన్ అందించి ఔదార్యం చాటుకున్నాడు. వివరాలు.. మొగలవల్లి కొట్టాలకు చెందిన తిక్కమ్మ అనారోగ్యంతో బెంగళూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కూతురి వద్ద ఉంటోంది. ఈ నెల పింఛను అందుకునేందుకు రాలేని పరిస్థితి ఉండడంతో గ్రామ వలంటీర్ శ్రావణ్‌రాజు శుక్రవారం బెంగళూరుకు వెళ్లి పింఛన్ సొమ్ము అందించి ఔదార్యం చాటుకున్నాడు. వలంటీర్‌కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

పెట్రోల్ బంకు తనిఖీ

ఆలూరు రూరల్: హాలహర్విలోని కర్నూలు–బళ్లారి రహదారిలో ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకును శుక్రవారం తహసీల్దార్ మల్లికార్జున తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. నిర్ణీత ధర, కొలతల్లో తేడాలు ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలకు అనుగుణంగా దుకాణాన్ని నిర్వహించాలన్నారు. ఫైర్ సెఫ్టీ కిట్లు, నీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. వీఆర్వో విజయ్ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ

- అజాగ్రత్త, నిర్లక్ష్యంతో ప్రమాదాలు
- వేసవిలో జాగ్రత్తలు పాటించాలి
- అరికట్టేందుకు ముందస్తు చర్యలు అవసరమంటున్న అధికారులు



గూళ్యంలో ఇటీవల అగ్నిప్రమాదంలో దగ్ధమవుతున్న గడ్డివాములు (ఫైల్)

ఆలూరు రూరల్: వేసవి కాలం ప్రారంభమైంది. తీవ్రమైన ఎండల వేడితో ఏదో ఒక చోట అగ్ని ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. విద్యుదాఘాతం, సిగరెట్, బీడీ కాల్చి ఆర్పివేయకుండా పడేయడం వల్ల చాలా చోట్ల అగ్నిప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రకృతి వైపరీత్యాల వల్ల సంభవించే అగ్ని ప్రమాదాలు పక్కన పెడితే మనిషి అజాగ్రత్త వల్ల జరిగే ప్రమాదాలే ఎక్కువని అగ్నిమాపక అధికారులు వెల్లడించారు. ఎండాకాలంలో అజాగ్రత్తగా ఉంటే అగ్ని ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంది. ముందు జాగ్రత్తగా కొన్ని నియమాలు పాటిస్తే వాటిని అరికట్టవచ్చు. ఆస్తినష్టంతో పాటు ప్రాణ నష్టాన్ని నివారించవచ్చని ఆలూరు అగ్నిమాపక, విపత్తుల నివారణ శాఖ అధికారులు ప్రజలకు సూచిస్తున్నారు. గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి నెలాఖరు వరకు 36 ఫైర్ కాల్స్ వచ్చినట్లు అగ్నిమాపక అధికారులు వెల్లడించారు. ఇందులో 35 గడ్డివాములకు నిప్పంటుకున్నవి కాగా ఒకటి రెస్క్యూ కాల్ వచ్చినట్లు చెప్పారు. అగ్ని ప్రమాదాల్లో రూ.19.85 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందన్నారు. సకాలంలో ఫైర్ సిబ్బంది వెళ్లి మంటలార్పివేయగా రూ. 35.5 లక్షల ఆస్తి నష్టం జరగకుండా కాపాడినట్లు ఫైర్ అధికారి ఖాద్రి వెల్లడించారు.

అగ్ని ప్రమాదాల నివారణకు పాటించాల్సిన జాగ్రత్తలు

- వంట గ్యాస్ వాడకం తర్వాత రెగ్యులేటర్ ఆఫ్ చేయాలి
- బయటి నుంచి ఇంట్లోకి వచ్చినప్పుడు గ్యాస్ వాసన వస్తే లైట్లు, ఫ్యాన్ వేయడం వంటివి చేయకుండా అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించాలి.
- సిగరెట్, బీడీ, చుట్ట వెలిగించిన వారు పడేసేటప్పుడు పూర్తిగా ఆర్పివేయాలి.
- ఇళ్లను వదిలి వెళ్లేవారు కరెంటు మెయిన్ ఆఫ్ చేసి వెళ్లాలి.దీంతో వేడికి వైర్లు షార్ట్‌సర్క్యూట్ అయినా విద్యుత్ ఇంట్లోకి ప్రవేశించకుండా ఉంటుంది.
- వంట చేసే మహిళలు కాటన్ దుస్తులను ధరించాలి. అగ్గిపెట్టెలు, లైటర్లు, కిరోసిన్ దీపాల నుంచి చిన్నారులను దూరంగా ఉంచాలి
- అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ఇంటి తలుపులు మూసి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వాలి. లేదా 101కు కాల్ చేయాలి.
- అగ్ని ప్రమాదం వల్ల అతిగా పొగ వెలువడి ఊపిరి అందదు. ఆ సమయంలో మంటల నుంచి తప్పించుకోవడానికి నేలమట్టానికి తాకుతూ ముందుకు వెళ్లాలి. దీని వల్ల అంత ప్రమాదం ఉండదు.

అజాగ్రత్తతోనే ప్రమాదాలు



వేసవి కాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అజాగ్రత్తతోనే ఎక్కువగా అగ్ని ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ముఖ్యంగా బహిరంగ ప్రదేశాల్లో బీడీ, సిగరేట్ కాల్చే వారు వాటిని పూర్తిగా ఆర్పివేయాలి. ఇళ్లలో మహిళలు నిర్లక్ష్యంగా ఉండరాదు. అగ్ని ప్రమాదం సంభవిస్తే వెంటనే ఫైర్ అధికారులకు సమాచారం ఇవ్వాలి.

– ఖాద్రి, అగ్నిమాపక అధికారి, ఆలూరు.

మెరుగైన వైద్య సేవలందించండి



కృష్ణగిరి పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ రామగిడ్డయ్య

కృష్ణగిరి: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ రామగిడ్డయ్య వైద్య సిబ్బందికి సూచించారు. కృష్ణగిరిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. గ్రామాల్లోని ఉపకేంద్రాల ద్వారా వైద్య సేవలు సక్రమంగా అందేలా చూడాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలని, ప్రతి ఇంటికి తిరిగి నీటిలోని లార్వాను గుర్తించి వాటి నిర్మూలనకు కృషి చేయాలన్నారు. ఆశా కార్యకర్తలు గ్రామాల్లో గర్భిణుల ప్రసవ సమయంలో ప్రభుత్వ వైద్యశాలలకు తీసుకెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఫామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి



ఎమ్మిగనూరు జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని శివన్న నగర్ సమీపంలో జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఆయన శుక్రవారం సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌తో కలిసి జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలను పరిశీలించారు.కాలనీలో రూరల్‌కు సంబంధించి 160 గృహాలు,పట్టణానికి చెందిన 1,158 పక్కా గృహ నిర్మాణాల దశలపై హౌసింగ్ డీఈ ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. గృహాలన్నీ బేస్ లెవెల్‌లో నిర్మాణాలు పూర్తి కావడంపై సంతృప్తి వ్యక్తం చేశారు.నిర్మాణాలు సత్వరం పూర్తి చేసుకునేలా లబ్ధిదారులను చైతన్య పరచాలని అధికారులకు సూచించారు. కాలనీలో విద్యుత్, నీటి సౌకర్యంపై ఆరాతీశారు. సీసీ రోడ్ల నిర్మాణాలకు వెంటనే ప్రతిపాదనలు తయారుచేయాలన్నారు. తహసీల్దార్ జయన్న, మున్సిపల్ డీఈ మనోహర్ రెడ్డి, ఏఈ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పల్లెల్లో దాహార్తి తీర్చండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ అంటోని

ఆలూరు: వేసవిలో గ్రామాల్లోని ప్రజల దాహార్తి తీర్చాలని ప్రజాప్రతినిధులు అధికారులను వేడుకున్నారు. హాలహర్వి మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ బోయ నెట్టికంతమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా టి.చాకిబండ, అర్ధగేరి, చింతకుంట, బేవినహాల్, కొక్కెరచేడు, బిలేహాళ్, ఎంకే పల్లి, తదితర గ్రామాల సర్పంచ్‌లు బసవరాజ్, ఓబులపతి, గురుదాస్‌రెడ్డి స్థానికంగా నెలకొన్న సమస్యలను ప్రస్తావించారు. చాలా గ్రామాల్లో తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదన్నారు. గ్రామీణ రహదారులు, ఉపాధి హామీ పథకం పనులు, అంగన్‌వాడీ కేంద్రాల పనులు సకాలంలో పూర్తి చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు లింగప్ప అధికారులను కోరారు. వైస్ ఎంపీపీ నాగేష్, ఎంఈఓ ఈరన్న, ఏఓ శంకర్, పీఆర్ ఏఈ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు, పాల్గొన్నారు.

జీవ వైవిధ్య సదస్సు

పత్తికొండ టౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో శుక్రవారం వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జీవ వైవిధ్యంపై రాష్ట్రస్థాయి సెమినార్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మాధురి అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో అనంతపురం ఎస్కే యూనివర్సిటీ వృక్షశాస్త్ర అధిపతి ప్రొఫెసర్ రవిప్రసాద్‌రావు ప్రసంగించారు. జీవ వైవిధ్య సంరక్షణను ప్రతి మానవుడు అత్యంత ముఖ్యమైన అంశంగా భావించాలన్నారు. మొక్కల మీద ఆధారపడిన మనం వాటి సంరక్షణకు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. అనంతరం రవిప్రసాద్ రావును ఘనంగా సన్మానించారు. వృక్షశాస్త్ర అధిపతి డాక్టర్ సుబ్బయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

నీటి కోసం ఘర్షణ

ఎమ్మిగనూరురూరల్: రాళ్లదొడ్డి గ్రామంలో శుక్రవారం సాయంత్రం కుళాయి నీటి కోసం జరిగిన ఘర్షణలో ముగ్గురికి గాయాలయ్యాయి. వివరాలు.. గ్రామానికి చెందిన చాంద్‌బాషా తండ్రి అబ్దుల్లా ఇంటి నిర్మాణం చేపట్టాడు. శుక్రవారం పైప్‌ద్వారా కుళాయి నీటిని గోడలకు తడుపుతుండగా పక్కింటికి చెందిన హుసేన్‌వలి, బడేసాబ్ తమ ఇళ్లకు నీరు రావడం లేదని ప్రశ్నించడంతో మాటమాట పెరిగి ఘర్షణకు దారితీసింది. దాడిలో ముక్తుమ్‌వలి, మాభి, చాంద్‌బాషాకు గాయాలయ్యాయి. చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు హుసేన్‌వలి, బడేసాబ్, మాభిలపై కేసు నమోదు చేసినట్లు రూరల్ హెడ్‌కానిస్టేబుల్ చంద్ర తెలిపారు.

అమృత్ సరోవర్‌తో ప్రయోజనం

వెల్దుర్తి: అమృత్ సరోవర్‌లో భాగంగా చెరువులలో పూడికతీత చేపట్టడం వల్ల భవిష్యత్తు తరాలకు నీటి సంరక్షణతోపాటు, భూగర్భ జలాల పెంపు, జలచరాలు, జంతువులు, పశువులకు నీటి సౌకర్యం, చెరువుల అభివృద్ధి, పునరుద్ధరణ, రైతులకు సాగు నీటి వసతి, కూలీలకు ఉపాధి, మట్టి రవాణా ద్వారా వాహనదారులకు ఆదాయం, పొలాల్లో పూడిక మట్టి చల్లడం వల్ల భూసార పెంపు తదితర మేలు జరుగుతుందని డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని ఎల్ నగరం గ్రామ తోట చెరువులో రూ.10 లక్షల అంచనాతో చేపడుతున్న డక్‌అవుట్ పాండ్ ద్వారా పూడికతీత పనులను పరిశీలించారు. ప్రస్తుతం రూ.3 లక్షల వరకు పనులు జరిగినట్లు తెలిపారు. పనులు వేగవంతం చేయాలని సూచించారు. కూలీల సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తానన్నారు. ప్రాజెక్టు పనుల్లో భాగంగా చెరువు కరకట్టపై పిచ్చి మొక్కలు తొలగించాలని ఏపీఓ రాజునాయక్‌ను ఆదేశించారు. అనంతరం రైతు నాగమ్మ ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా ఈ ఏడాది మూడెకరాల్లో చేపట్టిన మామిడి సాగును పరిశీలించారు. టీఏలు శేఖర్, మాణిక్యం, ఎఫ్ఏ చిన్నరంగడు ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని గంజిళ్ల రోడ్డులో శ్రీలక్ష్మి వెంకటేశ్వర ఏజెన్సీ యజమాని ఏనుగుబాల సత్యనారాయణ రెడ్డి ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. స్థానిక నాయకులు రియాజ్ అహ్మద్, బుట్టా రంగయ్య, తదితరులు ఉన్నారు.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

మద్దికెర: ఈ ఏడాది పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సర్వశిక్ష అభియాన్ ఏపీసీ వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆదర్శ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు ఏలా రాయాలనే అంశంపై ప్రముఖ వక్త సుబ్బారెడ్డి మోటివేట్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ పరీక్షలంటే భయం, ఆందోళన ఉండరాదన్నారు. రోజూ ఉదయాన్నే ధ్యానం చేయడం వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు, సలహాలు పాటిస్తే అధిక మార్కులు సాధించేందుకు వీలవుతుందన్నారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సవిత, ప్రధానోపాధ్యాయులు అగస్టీన్, రాజేశ్వరి, కేజీబీవీ ఎస్‌ఓ అబిదాబేగం తదితరులు పాల్గొన్నారు.

నందవరం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం కావడంపై ఎంఈఓ సుదర్శన్ రెడ్డి సలహాలు, సూచనలు చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులు భయం వీడి ఏకాగ్రతతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. హెచ్‌ఎం లచ్చప్ప, ఉపాధ్యాయులు ఉన్నారు.

కబడ్డీలో ప్రతిభ

ఆస్పరి: మండలంలోని కైరుప్పల జెడ్పీ హైస్కూల్లో చదువుతున్న వీణ, శ్వేత రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరచారని పీడీ రామాంజినేయులు తెలిపారు. శుక్రవారం విద్యార్థినులను హెచ్‌ఎం ఈశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు. వారు మాట్లాడుతూ.. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జనవరి 25 నుంచి 27 వరకు రాజమండ్రిలో జరిగిన అండర్ –17 విభాగం రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో 9వ తరగతి విద్యార్థిని శ్వేత సిల్వర్ మెడల్ సాధించిందన్నారు. అలాగే ఫిబ్రవరి 27 నుంచి మార్చి 1వ వరకు చిత్తూరులో అండర్ –14 విభాగంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో 9వ తరగతి విద్యార్థిని వీణ గోల్డ్ మెడల్ సాధించిందన్నారు. విద్యార్థినుల ఘనతపై గ్రామస్తులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

శనగ కొనుగోలు కేంద్రం ప్రారంభం



దేవనబండలో శనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఓ వెంకట్రాముడు

పత్తికొండ రూరల్: దేవనబండ గ్రామంలో శుక్రవారం శనగ కొనుగోలు కేంద్రాన్ని ఏఓ వెంకట్రాముడు ప్రారంభించారు. రైతుల నుంచి ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు రూ.5,230 ప్రకారం శనగ కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. శనగ విక్రయించాలనుకునే రైతులు పట్టాదారు పాసు పుస్తకం , ఆధార్, బ్యాంకు పాస్‌బుక్, సెల్ నంబర్ తదితర వివరాలతో రైతు భరోసా కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. ఏఈఓ రియాజ్‌బాషా, కేడీసీఎంఎస్ సిబ్బంది మురళి, మల్లి, ఆర్బీకే సిబ్బంది ఉన్నారు.

వెల్దుర్తి: బొమ్మిరెడ్డిపల్లె ఆర్బీకేలో శుక్రవారం ఏఓ అక్బర్‌బాష ఆధ్వర్యంలో శనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఏఓ మాట్లాడుతూ ఇప్పటి వరకు మండలవ్యాప్తంగా 132 మంది రైతులు శనగ దిగుబడులు అమ్ముకునేందుకు ఆర్బీకేలలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. వారం రోజుల్లో అందరి నుంచి శనగ కొనుగోలు చేస్తామన్నారు.

మద్దతు ధరకు శనగ కొనుగోలు

మద్దికెర: రబీ సీజన్‌లో సాగు చేసిన శనగదిగుబడులను ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాలుకు రూ. 5,230 ప్రకారం రైతుల ఇంటి వద్దే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు మార్క్‌ఫెడ్ అధికారి రామకృష్ణ తెలిపారు. శుక్రవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో శనగ దిగుబడులను పరిశీలించి రైతులకు రశీదులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. నమోదు చేసుకున్న రైతుల నుంచి క్రమ పద్ధతిలో శనగ కొనుగోలు చేస్తామన్నారు.

పన్ను వసూళ్లపై దృష్టి పెట్టండి

వెల్దుర్తి: పంచాయతీల పరిధిలోని ఇళ్లు, కుళాయి తదితర పన్నులు 85 శాతం వసూలయ్యాయని, ఈ నెలాఖరుకు ఆర్థిక సంవత్సరం ముగియనున్నందున 100 శాతం వసూళ్లు సాధించాలని ఈఓఆర్డీ నరసింహులు సెక్రటరీలను ఆదేశించారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని గోవర్ధనగిరి-1, 2, బింగిదొడ్డి, సూదేపల్లె(మదార్‌పురం) సచివాలయాలు, ఆర్బీకేలను ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు, హాజరు పరిశీలనానంతరంసిబ్బందితో మాట్లాడారు.సచివాలయాల ద్వారా అందించిన సేవల వివరాలు పక్కాగా నిర్వహించాలన్నారు. బింగిదొడ్డి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పరిశీలించి వర్మీ కంపోస్టు తయారీ, అమ్మకాలు, లాభ నష్టాలు బేరీజు వేసుకుని మరింత సంపద సృష్టించేందుకు కృషి చేయాలన్నారు. అమ్మకాల ద్వారా వచ్చిన ఆదాయంతో సిబ్బంది వేతనాలందించారు. సెక్రటరీలు రాజేశ్వరరావు,రాధిక, ఉమ, సచివాలయ, ఆర్బీకేల సిబ్బంది ఉన్నారు.

సెబ్ విస్తృత దాడులు



నిందితుల అరెస్ట్ చూపుతున్న సెబ్ అధికారులు

వెల్దుర్తి: మండలంలోని పలు గ్రామాల పరిధిలో నాటుసారా, అక్రమ మద్యం అమ్మకాలపై శుక్రవారం కోడుమూరు సెబ్ అధికారులు స్థానిక పోలీసులతో కలిసి దాడులు నిర్వహించారు. దాడులలో 25 లీటర్ల సారా, 96 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు కోడుమూరు సెబ్ ఇన్‌స్పెక్టర్ శ్యాంప్రసాద్ తెలిపారు. నిందితులు ఎల్ తండా రవీంద్రనాయక్, గోపాల్ నాయక్, బాలాపురం మునిస్వామి, పుల్లగుమ్మి నారాయణ, వెల్దుర్తి నాగన్నలను అరెస్ట్ చేసి డోన్ కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

స్కానింగ్ సెంటర్ల తనిఖీ

పత్తికొండ టౌన్: పట్టణంలోని స్కానింగ్ సెంటర్లను శుక్రవారం జిల్లా అదనపు వైద్యాధికారి భాస్కర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాటి అనుమతి పత్రాలను పరిశీలించారు. స్కానింగ్ సెంటర్లు నిర్వహించే వారు తప్పనిసరిగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అనుమతులు తీసుకోవాలని లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుత్రులను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం లింగనిర్ధారణ చట్టంపై అవగాహన కల్పించారు. వైద్యులు విజయభాస్కర్, అరుణ్‌కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా, రామకృష్ణ ఉన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

తుగ్గలి: జొన్నగిరి వద్ద అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రామాంజినేయులు శుక్రవారం తెలిపారు. ఆటోలో తరలిస్తున్న 35 బ్యాగుల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగిస్తామని ఎస్‌ఐ చెప్పారు.

ఇరు వర్గాలపై కేసు నమోదు

హొళగుంద: హెబ్బటంకు చెందిన రెండు వర్గాలపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అబ్దుల్‌జహీర్ శుక్రవారం తెలిపారు. గ్రామానికి చెందిన మాల వెంకటేష్ తనతో అసభ్యంగా ప్రవర్తించాడని శివగంగమ్మ ఇచ్చిన ఫిర్యాదు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అలాగే శివకుమార్, మరో ఆరుగురు తనపై దాడి చేసి కులం పేరుతో దూషించారని మాల వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

కంపోస్ట్ యార్డు పరిశీలన

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక సోగనూరు రోడ్డు సమీపంలోని కంపోస్ట్ యార్డ్‌ను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించారు. పట్టణం నుంచి తెచ్చే తడి, పొడి చెత్తను వేర్వేరుగా డంప్ చేసేలా చర్యలు తీసుకోవాలని శానిటరీ సిబ్బందిని ఆదేశించారు. చెత్తను సరైన పద్ధతిలో డంప్ చేయాలని సిబ్బందికి సూచించారు.

ప్రజా సేవకుడిగా ఉంటా..



మాట్లాడుతున్న స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి మధుసూదన్ నాయుడు

వెల్దుర్తి: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలలో తనను గెలిపిస్తే ప్రజా సేవకుడిగా సమస్యల పరిష్కారానికి ముందుంటానని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి మధుసూదన్ నాయుడు అభ్యర్థించారు. శుక్రవారం ఆయన చెరుకులపాడులో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవితో కలిసి ఆమె స్వగృహంలో వెల్దుర్తి, కృష్ణగిరి మండలాల వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. దివంగత నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెరుకులపాడు నారాయణరెడ్డితో తనకు గల సాన్నిహిత్యాన్ని గుర్తుచేసుకున్నారు. బడుగు వర్గాలకు అన్ని రంగాలలో ప్రాధాన్యత కల్పిస్తున్న ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీ అన్నారు. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి మాట్లాడుతూ.. తమ పార్టీ అభ్యర్థి మధుసూదన్‌నాయుడు గెలుపు లాంఛనమే అని, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు ఆయనకు ఓటు వేసి ప్రతిపక్ష పోరు లేకుండా చూసుకోవాలన్నారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ఇంటింటికీ తిరిగి ప్రజల కష్టాలు తెలుసుకుని పరిష్కరిస్తోన్నది తమ పార్టీ అని, టీడీపీని ప్రజలు ఎప్పుడో మరిచిపోయారని ఎద్దేవా చేశారు. ఎంపీపీ వెంకట్రామిరెడ్డి, మండలాల కన్వీనర్లు బొమ్మన రవిరెడ్డి, ఆర్‌బీ వెంకట్రాముడు, జెడ్పీటీసీలు సుంకన్న, సుభాషిణి, నాయకులు సమీర్‌కుమార్ రెడ్డి, శ్వేతారెడ్డి, వెంకట్ నాయుడు వైస్ ఎంపీపీలు రంగడు, రాజేశ్వరి, సుశీల, తదితరులు పాల్గొన్నారు.

డివిజన్‌లో 20 పోలింగ్ కేంద్రాలు



మాట్లాడుతున్న ఆర్డీఓ మోహన్‌దాస్

కృష్ణగిరి: పత్తికొండ డివిజన్ పరిధిలోని తొమ్మిది మండలాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 20 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్డీఓ మోహన్‌దాస్ తెలిపారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎన్నికలకు సంబంధించి ప్రతి మండల కేంద్రంలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, పత్తికొండలో 1,400 మందికిపైగా ఓటర్లు ఉండటంతో అదనంగా మరో కేంద్రం, అలాగే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి మరో అదనపు పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నామన్నారు. డివిజన్ వ్యాప్తంగా 9,385 మంది పట్టభద్ర ఓటర్లు, 430 మంది ఉపాధ్యాయ ఓటర్లు, స్థానిక సంస్థలకు సంబంధించి 144 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు. ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టామన్నారు. రెండు రోజుల్లో ఆయా గ్రామాల బీఎల్‌ఓల ద్వారా ఓటరు స్లిప్‌లు పంపిణీ చేస్తామని తెలిపారు. కృష్ణగిరి మండలంలో రీసర్వేకు సంబంధించి ఇప్పటివరకు 73 శాతం పూర్తయిందన్నారు. తహసీల్దార్ పురుషోత్తం, రీసర్వే డీటీ రామలక్ష్మి, ఆర్ఐ మస్తాన్, సర్వేయర్ వెంకటసుబ్బయ్య, వీఆర్వోలు ఉన్నారు.

సద్వినియోగం చేసుకోండి

నందవరం: వ్యవసాయ కూలీలు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని మేట్స్ ట్రెనింగ్ కో–ఆర్డినేటర్ జితేంద్రరెడ్డి సూచించారు. శుక్రవారం నందవరంలో రోజ్‌గార్ దివాస్‌యోజన కింద ఉపాధి హామీ పథకంలో భాగంగా మేట్స్, ఉపాధి కూలీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఉపాధి కూలీలకు పనికి తగ్గ వేతనం లభిస్తుందన్నారు. కచ్చితమైన కొలతతో పనిచేస్తే రోజుకు రూ.257 వేతనం పొందవచ్చన్నారు. ప్రతి గ్రామంలో ఉపాధి పనులు చేపట్టాలన్నారు. ఏపీఓ మాలిక్‌బాషా, ఈసీ నూర్జహాన్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.